క్లుప్తంగా

యోగి వేమన రెడ్డి సంక్షేమ సంఘ కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

కంభం: యోగివేమన రెడ్డి సంక్షేమ సంఘం కంభం, అర్ధవీడు మండలాల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జొన్నకూటి వెంకటరామిరెడ్డి, కార్యదర్శిగా గుడిసె గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా పోతిరెడ్డి నారాయణరెడ్డి, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు నరాల ఈశ్వరరెడ్డి, కొణతం సుబ్బారెడ్డి, కశిరెడ్డి ఈశ్వరరెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, రంగారెడ్డి, పుల్లారెడ్డి, ఆవుల సుబ్బారెడ్డి, శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఈఓపీఆర్డీ


బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి

కొనకనమిట్ల: మండల పరిషత్ విస్తరణాధికారిగా జి.శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ముండ్లమూరు మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా కొనకనమిట్లలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఓపీఆర్డీగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన రావూరి జనార్దన్ ముండ్లమూరు మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఈఓపీఆర్డీకి కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

14న సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్: ఈనెల 14వ తేదీన మార్కాపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే చెబితేనే బిల్లు!

- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కలగని మోక్షం
- ఎమ్మెల్యే అనుమతిస్తే నిధులు మంజూరు చేస్తామంటున్న అధికారులు
- గతంలో చేపట్టిన పనులకు బిల్లులు కాక సర్పంచ్‌ల గగ్గోలు
- గిద్దలూరు నియోజకవర్గంలోని పల్లెల్లో అపరిష్కృతంగా సమస్యలు
- నిలిచిన తాగునీటి పైప్‌లైన్లు, డీప్‌బోర్ల మరమ్మతులు
- గోతులమయంగా అంతర్గత రహదారులు


ఎస్సీ కాలనీలో రోడ్డుపైనే నిలిచిన మురుగు

బేస్తవారిపేట:

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది గిద్దలూరు నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి పరిస్థితి. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు, నూతన నిర్మాణాలు చేపట్టేందుకుం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినా వాటిని ఖర్చు పెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. చేసిన పనులకు బిల్లులు చేసుకునే పరిస్థితి లేకపోవడంతో సర్పంచ్‌లు అయోమయంలో ఉన్నారు. నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూస్ జేఈ, పంచాయతీరాజ్ ఏఈలకు ఎమ్మెల్యే నుంచి ఆదేశాలు రావడంతోనే బిల్లులు పెండింగ్ పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగా చేపట్టాల్సిన పనులకు కూడా నిధులు విడుదల చేయకపోవడంతో పల్లెల్లో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పంచాయతీల్లో గ్రామ సభలు, పారిశుధ్య కార్యక్రమాలకు, మంచి నీటి సమస్య తలెత్తినప్పుడు, విద్యుత్ మోటార్ల మరమ్మతులు, కొత్తవి కొనుగోలు చేసేందుకు సర్పంచ్‌లు తప్పనిసరి పరిస్థితుల్లో తమ జేబుల్లోంచే ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ముందుగా ఖర్చు చేసిన బిల్లులు కూడా నిధులు మంజూరైనప్పుడు సర్పంచ్‌లు తీసుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక..సర్పంచ్‌లు గతంలో చేసిన పనులకు బిల్లులు చేయవద్దని, గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు నిధులు చెల్లించవద్దని అధికారులకు మౌఖిక ఆదేశాలు అందడంతో బ్రేక్ పడినట్లు సమాచారం. బిల్లులు పెట్టుకోవాలంటే ఎమ్మెల్యే వద్దకు వెళ్లి చెప్పించాలని ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు ముఖానే చెప్పేస్తుండటంతో సర్పంచ్‌లు నిరాశగా వెనుదిరుగుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు సంబంధించి ఎం–బుక్ చేసిన పనులకు నిధులు ఇవ్వాలంటే ఎంపీడీఓతో చెప్పించాలని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. ఎంపీడీఓ మాత్రం ఎమ్మెల్యేతో చెప్పించాలని సెలవిస్తున్నాడని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొందరు సర్పంచ్‌లు, నాయకులు తప్పనిసరి పరిస్థితులల్లో ఎమ్మెల్యే వద్దకు వెళ్లి అధికారులకు నిధులు మంజూరు చేయాలని చెప్పాలని కోరుతున్నారు. మరికొందరు మాత్రం నిధుల కోసం ఎదురు చూస్తున్నారు.

వేధిస్తున్న తాగునీటి సమస్య

బేస్తవారిపేట ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో పైప్‌లైన్ ఇప్పటి వరకు దాదాపు 70 పర్యాయాలు పగిలిపోగా మరమ్మతులు చేసినట్లు పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. ఇక ఆ పైప్‌లైన్‌ను బాగు చేయడం తమవల్ల కాదని చేతులెత్తేయడంతో లీకేజీల ద్వారా నీరు వృథాగా పోవడమే కాకుండా ఇళ్లకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. అలాగే రాచర్ల మండలంలోని పాలకవీడు, అనుమలవీడు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు అధ్వానంగా ఉన్నాయి. పైప్‌లైన్ లీకేజీలతో నీరు వృథా అవుతోంది. కొమరోలు మండలంలోని గ్రామాల్లో 20 చేతిపంపులు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోలేదు. ఇవే పరిస్థితులు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉన్నాయి.


బేస్తవారిపేట పాత పోస్ట్ ఆఫీస్ వీధిలో డ్రెయినేజీ ఇలా..

అంతర్గత రోడ్లు బాగు చేసేదెప్పుడు?

రాచర్ల మండలంలోని కాలువపల్లె, అంకిరెడ్డిపల్లె వెళ్లే రాహదారులు, సంగపేట నుంచి బేస్తవారిపేట మండలం జేబీకే పురం వెళ్లే రహదారి కూడా అధ్వానంగా తయారైంది. బేస్తవారిపేట నుంచి చిన్న కంభం వెళ్లే రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బేస్తవారిపేట మేజర్ పంచాయతీలోని బీసీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, రెడ్డి నగర్, అంకాలమ్మ వీధి, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొమరోలు మండలంలోని ఎర్రగుంట్ల, ఒట్టిపేపమానుపల్లె వెళ్లే రహదారులు దారుణంగా తయారయ్యాయి.


బేస్తవారిపేట నుంచి చిన్న కంభం వెళ్లే రోడ్డు దుస్థితి ఇదీ..

15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు

మండలం	బేసిక్ గ్రాంట్	టైడ్ గ్రాంట్	మొత్తం
బేస్తవారిపేట	రూ.42.53 లక్షలు	రూ.63.80 లక్షలు	రూ.1.063 కోట్లు
రాచర్ల	రూ.32.12	రూ.48.20	రూ.80.33 లక్షలు
కంభం			రూ.57.93 లక్షలు
అర్ధవీడు	రూ.96.94	రూ.1.63 కోట్లు	రూ.2.60 కోట్లు
కొమరోలు			రూ.3.45 కోట్లు
గిద్దలూరు	రూ.40.41	రూ.60.62	రూ.1.01 కోట్లు

విలువలతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేయాలని, వారికి మంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. కిట్స్ కాలేజీలో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రముఖ కంపెనీల్లో సేవలందిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, హెచ్ఓడీలు రామ్మోహన్, అనిల్‌కుమార్, రాముడు, కిశోర్‌బాబు, ప్రసన్న మురళీ, రమణారెడ్డి, అమృతవల్లి, మనోహర్, ఫిజికల్ డైరెక్టర్ రంగస్వామి, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య


వార్డు సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి రూరల్: పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలని కనిగిరి డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా అవసరాల దృష్ట్యా పంచాయతీల నిర్వహణలో కొన్ని అంశాలపై దృష్టి పెట్టి పనిచేయవలసిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి పంపిణీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరరం డీఎల్‌డీఓను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.శోభన్ బాబు, సీనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధికి వార్డు సభ్యులు తమ వంతు కృషి చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికల గురించి చర్చించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీదేవి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కొమరోలు: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా కార్యదర్శులకు సమాచారం అందించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. గ్రామాలలో నీటి సమస్యపై సమాచారం ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ

మార్కాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మోహన్‌రాజ్, ఏపీఎం జీవరత్నం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవీ కోరితీ.. శరణాగతి


తర్లుపాడులో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఆలయాల్లో ఉత్సవమూర్తులు, మూలవిగ్రహ మూర్తులను వేద పండితులు, అర్చకులు మంగళవారం వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

- మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వేడుకగా దసరా ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన భక్తులు


పొదిలి : లలితాదేవిగా అంకాల పరమేశ్వరి


బేస్తవారిపేట : లలితా దేవిగా వాసవీమాత

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో మీనాక్షీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పాపాయిపల్లె, బేస్తవారిపేట పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబండ బజారులోని కనక దుర్గమ్మ ఆలంయలో మహాలక్ష్మీదేవిగా, కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రిమాత ఆలయంలో సరస్వతీదేవిగా, వీరన్నబావి సమీపంలోని కాళికాంబ ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. నరవ రోడ్డులోని కాశినాయన కుంట కట్ట మీద గల కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు.

కంభం: స్థానిక అమ్మవారిశాలలో వాసవీమాత పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రికి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు కాత్యాయినిగా, శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి వద్ద ముద్దసానమ్మ దేవస్థానంలో అమ్మవారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పొదిలి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కామాక్షి దేవిగా, కంభాలపాడులోని అంకాల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి పూజలు చేశారు.

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నాగేళ్లముడుపు, పోతలపాడు, మీర్జపేట తదితర గ్రామాల్లో వివిధ అలంకారాల్లో దేవతామూర్తులు కొలువుదీరారు. తర్లుపాడులోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. .

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మగుడి, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో వాసవీ మాతకు కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


కంభంలో పార్వతీదేవి అలంకరణలో అమ్మవారు


గొట్లగట్టు రామాలయంలో..


మార్కాపురం : శివాలయంలో కాత్యాయినిగా..


మార్కాపురం : లక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయంలో సంతానలక్ష్మిగా..


గిద్దలూరు : గాయత్రీదేవి ఆలయంలో సరస్వతీదేవిగా


పొదిలి : కామాక్షిదేవి అలంకరణలో వాసవీ మాత


మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ


బేస్తవారిపేట : మీనాక్షీదేవిగా కోటసత్యమాంబదేవి


సోమవారిపేటలో మహాలక్ష్మీదేవిగా చౌడేశ్వరీదేవి


గిద్దలూరు : పార్వతీదేవి అలంకరణలో వాసవీమాత


కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో..

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09వ సంవత్సరంలో పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఉత్సాహంగా సాగింది. స్నేహితులంతా కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో చిన్ననాగుల్‌మీరా, వీర నారాయణ, నాగ అంజి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.

క్రాకర్స్ యజమానులు జాగ్రత్తలు పాటించాలి

- సబ్ కలెక్టర్ త్రివినాగ్


ఎస్వీకేపీ కాలేజ్ మైదానాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన సీఐ, తహసీల్దార్

మార్కాపురం: క్రాకర్స్ యజమానులు జాగ్రత్తలు పాటించాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్ సూచించారు. దీపావళి పండగను పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలో సుమారు 20 షాపులను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశాల కోసం ఆయన మంగళవారం సీఐ సుబ్బారావుతో కలిసి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, ఎస్వీకేపీ కళాశాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. భద్రతా పరంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండే ప్రాంగణాన్ని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. క్రాకర్స్ యజమానులు తమ షాపుల వద్ద ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవడంతోపాటు ఇసుక, మంచి నీరు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. దుకాణాల వద్ద అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని షాపుల యజమానులకు సీఐ సూచించారు. తహసీల్దార్ చిరంజీవి, పట్టణ ఎస్సై సైదుబాబు ఉన్నారు.

రసాయన ఎరువులతో అనర్థాలు


వరి రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్


చెన్నరాయునిపల్లెలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: వరిపంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గాలి, సూర్యరశ్మి ప్రసరణ బాగా జరిగి చీడపీడల ఉధృతి తగ్గుతుందని, ఎరువులు, పురుగుమందులు చల్లుకునేందుకు వీలుగా ఉంటుందని ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పెద్ద ఓబినేనిపల్లె, చిన్న ఓబినేనిపల్లె గ్రామాల్లో రైతులకు సలహాలు ఇచ్చారు. ఏఓ జక్కం మెర్సీ, ఉద్యానవనశాఖ అధికారిణి శ్వేత సిబ్బంది పాల్గొన్నారు.

- రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని అర్ధవీడు ఏఓ షేక్ మహమ్మద్ మాగుటూరు, కాకర్లలో రైతులకు సూచించారు.
- సాగులో ఎదురవుతున్న సమస్యలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో చర్చించి పరిష్కరించుకోవాలని కొమరోలు ఏఓ కె.రాజశ్రీ చింతలపల్లె, నల్లగుంట్ల గ్రామాల రైతులకు స్పష్టం చేశారు.
- రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలని గిద్దలూరు ఏఓ విజయభాస్కర్‌రెడ్డి కొత్తకోట, తంబళ్లపల్లె గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు.
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు రాయితీపై శనగ విత్తనాలు అందిస్తున్నట్లు మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వేములకోట, చెన్నరాయుడుపల్లెలో కంది రైతులకు సలహాలిచ్చారు.
- పొదిలి నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెం, నందిపాలెం గ్రామాల్లో కంది, సజ్జ రైతులకు వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ సూచనలిచ్చారు.
- తర్లుపాడు మండలంలోని పోతలపాడు గానుగపెంట గ్రామాల్లో మిరప, పత్తి పంటలను ఏఓలు వెంకటేశ్వర్లు, శైలజ పరిశీలించారు. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడి సాధించే ప్రణాళికను వివరించారు. పశువులకు గాలికుంటు, గొంతువాపు నివారణ టీకాలు వేశారు.